# 10. అతను మా నాన్న!

కుర్రాడికి జ్వరం చాలహెచ్చుగా ఉంది.

రాత్రి ఏమీ తినలేదు. తాగలేదు.

వాళ్లనాన్న ఆఖరి బస్సుకు పై వూరి నుండి వచ్చాడు. తండ్రి వచ్చే వరకు వాళ్లమ్మ కొడుకు దగ్గిరే కూర్చుంది. ఆమెకు కొడుకు జ్వరం అంతు పట్టడంలేదు. వీధి అరుగుమీద చిన్న మంచం పడుతుంది. దానిమీదే ఆమె ఇంతవరకు కూర్చుంది, కొడుకు పక్కను.

అదేమీ మాయదారి జ్వరమో వస్తున్నది, పోతున్నది. పెద్దాసుపత్రి డాక్టర్లకు చూపిస్తే ఏవో మాత్రలు ఇచ్చారు. జ్వరం రెండు రోజులు తగ్గియథా ప్రకారం వస్తున్నది. మళ్లావెళ్తే స్పెషలిస్టు దగ్గిరికి పొమ్మన్నారు. కనీసం ఎంత తక్కువ ఫీజు ఇచ్చినా ఏభై రూపాయలు అబ్బో! అంత డబ్బే!

ఆమె మెడలో పుస్తెలు కూడా లేవు - ఏనాడో ఇంటి కోసం అమ్మేసింది.

కుర్రాడు నెలలతరబడి జ్వరంతో ఇంటి దగ్గిర ఉండిపోతున్నాడు. సరిగ్గా స్కూలుకి వెళ్లడం లేదు. పదేళ్ల కుర్రాడు - బాగానే చదువుతాడు ఏంప్రయోజనం!

వాళ్లనాన్న గవర్నమెంటు ఆఫీసులో పనిచేస్తున్నాడు, ఎటెండరుగా. అది కూడా టెంపరరీ ఉద్యోగం. ఎవరేనా నెలో రెండు నెలలో సెలవు పెడితే, పెట్టిన ఆసామీకి సగం జీతం ఇవ్వాలి. ఈ ఉద్యోగానికి సర్వీసు కమిషను పరీక్ష అక్కరలేదు.

వాళ్లనాన్న వేపు వాళ్లు, అమ్మవేపు వాళ్లు ఎవరూ సంపన్నులు కారు. ఇద్దరూ సామాన్యమైన కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లే. అతను పదోతరగతి పాసయాడు. చిన్నతనంలోనే పెళ్లయింది. కొడుకు కూడా పుట్టాడు. పల్లెటూరిలో పనులు లేక నగరానికి వచ్చి. ఓ పుణ్యాత్ముడి దయవల్ల ఈ టెంపరరీ నౌకరీలో నాలుగు సంవత్సరాలయి పని చేస్తున్నాడు. ఆరేళ్ల కొడుకు అతను ఉద్యోగంలో చేరేసరికి. ఇప్పుడాకుర్రాడు ఆరోక్లాసు చదువుతున్నాడు. వాళ్ల నాన్నకి సంవత్సరంలో నాలుగు మాసాలు ఉద్యోగం ఉండదు. సెలవుపెట్టిన వాళ్ల ధర్మమా అని సగం జీతం దొరుకుతుంది. అతను మరి కొడుక్కి ఎలా మందు లిప్పించగలడు? పళ్లు, పాలు, మంచిగాలి ఇవన్నీ ఉంటే ఆ కుర్రాడు బాగానే ఉంటాడు. కాని వీధి అరుగు పక్కనుంచి నిరంతరం కుళ్లుకాలువ పారుతునే ఉంటుంది. దోమలు గానసభ చేస్తునే ఉంటాయి.

రాత్రి తొమ్మిదిన్నర దాటింది. వాళ్లమ్మ వేడిగా వండి తండ్రికి వడ్డిస్తూ ఉంది. వాళ్ల నాన్న మాటలు కుర్రాడికి వినిపిస్తున్నాయి. మరో పదిరోజులలో అతని ఉద్యోగం ముగుస్తుందని వాళ్లమ్మతో చెప్తున్నాడు. ఇక కుర్రాడికి మందులిప్పించడానికి అవకాశమేదీ?

పాతపోస్టాఫీసుకి వాళ్లిల్లు దగ్గిరగా ఉంది, బస్సులన్నీ నగరంలో నాలుగు మూలలకి అక్కడినుంచే బయలు దేరుతాయి. వాళ్లనాన్న భోజనం, తల్లి భోజనం అయేసరికి మరొక అరగంట పడుతుంది.

కుర్రాడు లేచి కూర్చున్నాడు. అతని తలదిమ్ముగా ఉంది – దానిలో ఒక్క ఆలోచన కూడా కొట్లాడలేదు. మంచందిగి, అరుగుదిగి కుర్రాడు బస్సులవేపు నడిచాడు.

.............................................................................................................

'బాబూ!' ఇంటి యజమానురాలు పిలిచారు.

పెరట్లో పువ్వులు కోసి తెస్తున్న కుర్రాడు వడిగా వంటింటివేపు నడిచాడు.

'ఏమమ్మగారు?'

"బజారుకి వెళ్లి ఉప్పు పాకెట్టు, కరివేపాకు, పచ్చిమిరపకాయలు తీసుకురా! అయ్యగారు డబ్బులిస్తారు."

ఉదయం తొమ్మిది గంటలయింది. మేడమీద గదిలో పేపరు చదువుకుంటున్న అయ్యగారి దగ్గిర డబ్బులు తీసుకొని కుర్రాడు బజారు కెళ్లాడు.

... రెండు సంవత్సరాల కిందటిమాట అయ్యగారు కూరల బజారులో చాల కూరలు కొన్నారు. ఇంట్లో ఉన్న ఇద్దరు మనుషులకు అన్ని కూరలెందుకు? కొందరు కూరలు చూసినా, పుస్తకాలు చూసినా మనసు ఆపుకోలేరు. కూరలన్నీ పెద్ద సంచీలో పట్టినా పెద్ద ఆనపకాయ మాత్రం అందులో ఇమడలేదు. దాని చిన్న తొడిమ చేతిలోకి అందడం లేదు. చేయ జారిపోతున్నది.

అతని వెనుకనుంచి ఒక పది సంవత్సరాల కుర్రాడు ముందుకొచ్చి అన్నాడు.

"అయ్యగారు! ఈ ఆనపకాయ పట్టుకొని మీ ఇంటివరకు వస్తాను. నాకివ్వండి!"

అయ్యగారు కుర్రాడి ముఖంలోకి చూశారు. వాడి కళ్లలో అమాయకత్వంతోస్తున్నది. మనిషి దుర్బలంగ ఉన్నాడు.

అయ్యగారు చాల పెద్ద ఉద్యోగమే చేశారు. ఆ మధ్యనే రిటైరయి తమయింట్లో స్థిరపడ్డారు. రిటైరవడానికి ఆరునెలలు ముందుగా ఆయన తనపని తాను చేసుకోడం మొదలుపెట్టారు. గవర్నమెంటు బంట్రోతుల చేత స్వంత పనులు చేయించడం మానిపించారు. రిటైరయిన తరువాత ఒక ఆరునెలలు బాగానే గడిచాయి. తరువాత ఆ దంపతులు అంతపెద్ద యింట్లోను ఒంటరి వాళ్లుగా అయినట్లనిపించింది. అప్పటి నుంచి అయ్యగారు ఒక పదేళ్ల కుర్రాడి గురించి చూస్తుండేవారు.

ఆ కుర్రాడిని తమతో పాటు... ఆయన ఆలోచిస్తున్నారు. గేటు తీసుకొని, గడపదాటి ఆయన ఇంట్లోకి వెళ్లారు. ద్వారం దగ్గిర కుర్రాడు నిలబడి పోయాడు. మరో పది నిమిషాల

తరువాత అయ్యగారు వచ్చారు.

'ఏం, నిలుచుండి పోయావు? లోపలికి రా!' అన్నారాయన, ఆనపకాయ కుర్రాడి చేతిలోంచి తీసుకుంటూ.

'లోపలికి రావచ్చా?' కుర్రాడు అడిగాడు.

అయ్యగారికి చాల బాధ కలిగింది. ఉద్యోగంతో ఆయన ఈ భేదం పాటించలేదు.

'అబ్బాయ్! మనమందరం ఒకటే, ఆడమగభేదం తప్ప. నిర్భయంగా లోపలికిరా అమ్మగారు నీ కోసం కూడా కాఫీ తయారు చేస్తున్నారు.'

ఆ విధంగా ఆ యింట్లోకి కుర్రాడు అడుగుపెట్టాడు.

అయ్యగారు కాని, అమ్మగారు కాని ఆ కుర్రాడి పూర్వ జీవితం గురించి అడగలేదు. అతనికి కావలసిన అవసరాలు మాత్రం తీర్చేవారు.

అయ్యగారు విద్యాశాఖాధికారిగా పనిచేశారు. లెక్కలలో చాల గొప్పవారు. చాల వ్యాసాలు గణితబోధన మీద వ్రాశారు. చాల మంచి ఉపన్యాసకులు.

ఆయన కుర్రాడికి గురుత్వం వహించారు. అంత కన్న ఇంకేం కావాలి?

అందరికీ అటువంటి అదృష్టం కలుగదు. ఆ యింటికి చేరిన రెండు సంవత్సరాలలో కుర్రాడు పూర్తిగా మారిపోయాడు. ఆరోగ్యం బాగుపడింది. చురుకుగా పనులు చేస్తున్నాడు. అటు అమ్మగారికి ఇటు అయ్యగారికి తలలో నాలుకయాడు...

కుర్రాడు బజారు కెళ్లిన తరువాత ఒక నడివయసులో ఉన్న అతను అయ్యగారి కోసం వస్తే అమ్మగారు మేడమీదికి పంపించారు.

కుర్రాడు వచ్చిన అరగంటకు అయ్యగారికేక వినిపించింది. కాఫీ మేడమీదికి పంపమని. కుర్రాడు కాఫీ పట్టుకొని వెళ్లాడు.

ద్వారం దగ్గిర నిలబడ్డాడు. లోపల నుండి వస్తున్న కొత్తాయన మాటలు చాల పరిచితంగా వినిపిస్తున్నాయి.

'మీరు నాకు చేసిన మేలు ఎప్పటికి మరచిపో లేను.' ఆగంతకుడు అంటున్నాడు.

'నేను చేసిన దేముంది? నువ్వు చాల నమ్మకమైన వాడివి. నీకు సహాయం చేయడానికి నాకు చాలకాలం పట్టింది. చివరకు రిటైరయే వేళ ధైర్యంతో నాలుగు ముక్కలు నీ గురించి రిపోర్టులో వ్రాశాను.'

'నేను విన్నాను.'

'ఇప్పుడు రిటైరయాను. చెప్పుకోడానికి ఇబ్బంది లేదు.'

'చిత్తం.'

'నువ్వు చాల విశ్వాసపాత్రుడువని, పని చాల నేర్పుతోను, చురుకుగాను చేస్తావని,

నాలుగు సంవత్సరాలయి సెలవుల కాళీలలో పనిచేస్తున్నావని, తప్పకుండా పెర్మనెంటుకాళీలో వేయవలసిందని వ్రాశాను.'

'మీరు నాకు మహోపకారం చేశారు.'

'నేను రిటైరయి, నా తరువాత వచ్చిన అధికారికి నీ గురించి ఈ మాటలే చెప్పాను. ఆయన కూడ నీ పనితీరు గమనించి, నేను విడిచిపెట్టిన కార్యం పూర్తి చేశారు.'

'మీరు రిటైరయిన ఆరునెలలలోనే నాకు పెర్మనెంటు కాళీలో వేశారు.'

'చాల బాగుంది.'

'ఒక నాలుగు నెలల కింద గుమస్తా కాళీవస్తే, నాకు ప్రమోషనిచ్చి అందులో వేశారు.'

'బీదవాడివి – నీకీ ప్రమోషను బాగా ఉపకారం చేస్తుంది.'

'పూర్వం ఎవరి పంచనో తలదాచుకునే వాళ్లం. ఇప్పుడు సీతంపేటలో మంచి యింటికి మారిపోయాం.'

'చాల బాగుంది.'

'చాలకాలం ఒకపూటతిని, ఒకపూట పస్తుండి గుట్టుగ సంసారం చేసుకుంటూ వచ్చాం. ఈ రోజు నుంచి బట్టలు వేసుకుంటూ, రెండుపూట్ల తింటున్నామంటే అదంతా మీ చలవే.'

'దానికేముంది. నువ్వు కష్టపడి నమ్మకంగా పనిచేశావు. దేనికీ చెయ్యిచాచలేదు.'

'మరొక అధికారి మీ జాగాలో ఉంటే, బహుశా ఈ ఉపకారాలు ఇంత ఉదారంగా జరిగి ఉండేవి కావ.'

'దానికేం!'

సంభాషణ ముగియవచ్చినటుంది. కుర్రాడు గదిలోకి కాఫీ తీసుకొని వెళ్లాడు.

ఆ వచ్చిన మనిషి ఒక క్షణం మటు దక్కి కుర్రాడిని చూస్తూ ఉండిపోయాడు. తరువాత కొంచెం తెప్పరిల్లి ఒకే గుటకలో కాఫీ తాగేశాడు. చేతులు జోడించి ఇంటి యజమనికి నమస్కారం చేసి మరే మాటలు ఆడకుండా మెట్లు దిగి వెళ్లి పోయాడు.

ఆయ్యగారు భుజం మీది కండువాతో కళ్లజోడు తుడుచుకొని, చేష్టలు దక్కి నిలుచున్న కుర్రాడిని చూసి అడిగారు.

'ఈ వచ్చిన అతను నీకు బాగాపరిచయమున్న వాడిలా కనిపిస్తున్నాడే!'

'అవును. చాలబాగా తెలిసిన మనిషి'.

'అయితే అతను కాని, నువ్వుకాని పలకరించుకో లేదేం?'

కుర్రాడు జవాబు చెప్పలేదు.

'ఇంతకూ, అతను నీకేమేనే అవుతాడా?'

'అతను మా నాన్న!'